క్లుప్తంగా

శాస్త్రోక్తంగా మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు



మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధి వంటి వాటితోఅభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి అందజేస్తున్న తలపా దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం పానగల్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు తలపా దామోదరం రెడ్డి విద్యాసామగ్రి అందజేశారు. పరీక్షలలో బాగా రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోమలాదేవి, ఉపాధ్యాయులు బాల గురుమూర్తి, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షుడు చెరుకు తోట రాహుల్ తదితరులు పాల్గొన్నారు

పిళ్లారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



పుస్తకాలు పంపిణీ చేస్తున్న పిళ్లారి ఫౌండేషన్ సభ్యులు

శ్రీకాళహస్తి పట్టణంలోని బాబు అగ్రహారం, రాజీవ్ నగర్‌లోని పాఠశాలలు, ఎన్టీఆర్ నగర్‌లోని గురుకుల పాఠశాల, వేడాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం పిళ్లారి ఫౌండేషన్ నిర్వాహకులు పరీక్ష సామగ్రి అందజేశారు. ఫౌండేషన్ అధినేత అమరావతి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. అదే విధంగా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా తెలుగుగంగ కాలనీలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్‌నాయుడు, సంస్థ సభ్యులు బాబా ఫరీద్, వాసుదేవరావు, ఫణీంద్ర, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సగం మందికే రేషన్ సరుకులు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రంగయ్య

ఏర్పేడు(రేణిగుంట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న చౌకదుకాణం సరుకులు రేషన్‌షాపు డీలర్లు సగం మందికే ఇచ్చి మిగిలిన వారికి మొండిచేయి చూపుతున్నారని సీపీఎం మండల నాయకుడు రంగయ్య వాపోయారు. ఆయన సోమవారం ఏర్పేడులో విలేకరులతో మాట్లాడుతూ రెండు నెలలుగా మండలంలోని చౌకదుకాణ డీలర్లు మొదటి వారంలో సగం మంది కార్డుదారులకే సరుకులు ఇస్తున్నారని తెలిపారు. తర్వాత వచ్చిన వారికి సరుకులు అయిపోయాయని చెబుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్ పర్యవేక్షించి కార్డుదారులందరికీ రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. సోమవారం ఈ మేరకు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టు ఆధునీకరణ పనులకు గత ప్రభుత్వంలో మంజూరైన రూ. 33 కోట్లతో పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ గేట్ల ఏర్పాటుకు రూ. 44కోట్లు మంజూరు చేయాలన్నారు. అలాగే బీఎన్‌కండ్రిగ మండలంలోని ఉబ్బలమడుగు ప్రాజెక్టు నుంచి సాగునీరు అందించేందుకు కుడి, ఎడమ కాలువలను పూర్తి చేయాలని కోరారు.

దుమ్ము లేస్తోంది

- అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పైపులైన్ తవ్వకాల పనుల వల్లేనని ఆవేదన

వరదయ్యపాళెం: అటు గ్యాస్ పైపులైన్లు, ఇటు వాటర్ పైపులైన్ కోసం ఇష్టారాజ్యంగా జరుపుతున్న తవ్వకాలతో సత్యవేడు–కడూరు కూడలి, శ్రీకాళహస్తి–తడ ఆర్ అండ్ బీ రోడ్లు దెబ్బతింటున్నాయి. దీనికితోడు పలుచోట్ల పైపులైన్ల కోసం తవ్వకాలు చేసి మట్టి కుప్పలను అలాగే వదిలేయడంతో వాహనం వెళ్లినప్పుడు పెద్ద ఎత్తున దుమ్మురేస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము పీల్చి అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు. అసలే వేసవి ప్రారంభం కావడంతో రోడ్లపై మట్టి లేస్తోందని, వాహనాలు వెళ్లే సమయంలో మరింత దుమ్ము, ధూళి లేస్తుండడంతో ఇళ్లలో ఉండలేకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వాహనం వెళ్లే సమయంలో వెనక వెళ్లే ద్విచక్ర వాహనదారులు దుమ్ముకు కళ్లు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. పైపులైన్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు కనీసం మట్టి కుప్పలు ఉన్న ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లితే దుమ్ము పైకి లేవకుండా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా సత్యవేడు–కడూరు కూడలి మార్గంలో రాచర్ల, యానాదివెట్టు, కంచరపాళెం, సుబ్బరాజుకండ్రిగ, వెంకటరెడ్డికండ్రిగ, కడూరు ప్రాంతాల్లో, శ్రీకాళహస్తి–తడ మార్గంలోని నెలవాయి, వేణుగోపాలపురం, తలారివెట్టు, ఎన్టీఆర్‌నగర్, ఇందిరానగర్, వరదయ్యపాళెం దళితవాడ ప్రాంతాల్లో దుమ్ము రేగుతోంది. దీనిపై ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు స్పందించి స్థానికులకు, వాహనదారులకు అసౌకర్యంగా చేపడుతున్న పనులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంచరపాళెం వద్ద వాహనం వెనక లేస్తున్న దుమ్ము

ఇళ్లలో ఉండలేకున్నాం



రోడ్ల వెంబడి గ్యాస్ పైపులైను కోసం ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. తవ్విన మట్టిని రోడ్లపైన వేయడంతో వాహన రాకపోకలకు దుమ్ము రేగుతోంది. దీంతో రోడ్డు పక్కన నివాసమున్న మేము దుమ్ము తాకిడికి తట్టుకోలేకున్నాం. అనారోగ్యం పాలవుతున్నాం. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

– యతిరాజులు, కంచరపాళెం

చర్యలు తీసుకోవాలి



రోడ్డుపై పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ కనీస భద్రతా ప్రమాణాలు చేపట్టడం లేదు. నెలరోజులకు పైగా కంచరపాళెం వద్ద పైపులైను పనులు చేపడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా మట్టి కుప్పలు వేయడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము రేగుతోంది. రోడ్ల వెంబడి ఉన్న ఇళ్లు దుమ్ముతో నిండిపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–బందిల సురేష్, కంచరపాళెం

రేపు అష్టబంధన మహాకుంభాభిషేకం

నాగలాపురం: పట్టణంలోని ధర్మరాజుల గుడి వీధిలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో బుధవారం నుంచి అష్టబంధన మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం విష్వక్సేన ఆరాధన, స్వస్తి వాచకం, రక్షాబంధనం, అంకురార్పణం, 13న ప్రధాన కలశ పూజ, లక్ష్మినారాయణ హోమం, లఘు పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ట, సుదర్శన హోమం, 14న గోపూజ, సుమంగళి పూజ, కన్యపూజ, వేద ప్రబంధ పారాయణం, ఆలయ ప్రవేశ ద్వార ప్రదక్షిణ, గోపుర శిఖర సంప్రోక్షణ, దేవతా సంప్రోక్షణ, విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ద్రౌపదీ అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించి అమ్మవారిని ఊరేగిస్తామన్నారు.



కుంభాభిషేకానికి ముస్తాబవుతున్న ద్రౌపదీ అమ్మ ఆలయం

యువత పోరును విజయవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ : తిరుపతిలోని జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువత పోరును జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనరు కొనతనేని మణినాయుడు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో పార్టీ శ్రేణులతో కలిసి యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలను నిలిపివేసిందన్నారు. ఫీజులివ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నందుకు నిరసనగా అన్ని వర్గాల ప్రజలతో పాటు విద్యార్థి విభాగాలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం, నాయకులు గురవయ్య, కోటేశ్వరరావు, ప్రసాద్, సంజీవయ్య, వేంకటేష్, అమలింగయ్య, జయచంద్రనాయుడు, పరంధామయ్య, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మణినాయుడు, నాయకులు

యువత పోరును విజయవంతం చేయండి

రేణిగుంట : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో చేపట్టనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్ర వరప్రసాద్ చౌదరి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని యువకులు, విద్యార్థులు, నిరుద్యోగులు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సారథ్యంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ గళం వినిపించాలని కోరారు.

'యువత పోరు'కు తరలిరండి

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పార్టీ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఏ. మునిరాజ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించకుండా మోసం చేస్తోందని ఆరోపించారు.

గ్యాస్ పైపులైన్ గుంత పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్ రోడ్డులో ఓ వైపున గ్యాస్ పైపు లైన్ కోసం తవ్వి వదిలేసిన గుంతను ఎస్ఐ విశ్వనాథనాయుడు సోమవారం జేసీబీతో పూడ్పించారు. మెయిన్‌రోడ్డులో గుంతను తవ్వి నెలరోజులుగా పూడ్చకపోవటంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన సాక్షి దినపత్రికలో గ్యాస్ పైపులైన్ గుంతలను పూడ్చండి అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్ఐ విశ్వనాథనాయుడు జేసీబీతో గుంతను పూడ్పించారు. వాహనదారులు, షాపుల యాజమానులు సంతోషం వ్యక్తం చేశారు.



గ్యాస్‌పైపు లైన్ గుంతను పూడ్పిస్తున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు

పరిసరాల పరిశుభ్రత అవసరం

వరదయ్యపాళెం: పరిసరాల పరిశుభ్రత అవసరమని, ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్ తెలిపారు. సోమవారం వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం గ్రామంలో వైరల్ ఫీవర్లపై ఇంటింటి సర్వే నిర్వహించారు. రెండు రోజుల క్రితం బత్తలవల్లంలో డెంగీ జ్వరాలు ప్రబలినట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు రావడంపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ స్పందించింది. అయితే సర్వేలో డెంగీ జ్వరాల విషయం బయటపడలేదు. ఈ క్రమంలో పారిశుధ్య మెరుగునకు చర్యలు చేపట్టాలని మలేరియా అధికారి ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మోహన్, ఐడీ ఎస్పీ సెల్ అధికారి సిరావుద్దీన్, వైద్యాధికారి లావణ్య, ఎంపీహెచ్ఈఓ రవీంద్ర, పీహెచ్ఎన్ రాణెమ్మ, పీహెచ్ఓ నిఖిల, ఏఎన్ఎం కవిత పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డాక్టర్ రూప్‌కుమార్

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

బుచ్చినాయుడుకండ్రిగ: వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం మండల స్థాయి అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల ప్రజావేదికలో వచ్చిన వినతులను విచారించి పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులను చూపించి, వలసలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పల్లెపండుగ కార్యక్రమంలో గ్రామాల్లో వేస్తున్న సిమెంట్ రోడ్లు పనులను వేగవంతం చేయాలన్నారు. భూముల రీసర్వే కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించి, వారి పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఎంఈవో మునిసుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ వింధ్య, ఏపీవో భానుప్రియ, ఆర్ఐ నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

నేడు పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజలు



ఈవో లత

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో వెలసిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోష పూజలు నిర్వహించనున్నట్టు ఈవో లత తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 వరకు ప్రదోష మండపంలో నందీశ్వరుడు, వాల్మీకేశ్వర స్వామి, మరకదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రూ.500 చెల్లించి ప్రదోష పూజలో పాల్గొనవచ్చని సూచించారు.

సీఆర్‌ఎస్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట సీఆర్‌ఎస్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వుమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ సుభాషిణీ దేవి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. సీఆర్‌ఎస్ మహిళా సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభను కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సీఆర్‌ఎస్ చీఫ్ వర్క్స్ మేనేజర్ దేవసహాయం, రైల్వే డీఎస్‌పీ హర్షిత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చిన్నారులు నృత్యాలు, కరాటే విన్యాసాలు చేశారు. అలాగే రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో సీఆర్‌ఎస్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రేవతి, కరుణ, హిమజాబాయి, ఏడబ్ల్యూపీవో శ్రీనివాస్, సత్యప్రకాష్, రమేష్, గోపాల్ నాయక్, దాస్యా నాయక్, నవీన్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న రైల్వే డీఎస్‌పీ హర్షిత

కండక్టర్లు, డాక్టర్లకు సన్మానం



మహిళా కండక్టర్లు, డాక్టర్లు, ఎంఈవోను సన్మానిస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

సత్యవేడు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సత్యవేడు ఆర్టీసీలో పనిచేస్తున్న మహిళా కండక్టర్లు, సిబ్బందిని, డాక్టర్లు, ఎంఈవోలను సోమవారం ఘనంగా సన్మానించారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. వారు మరింత ఆర్థికంగా, సామాజికంగా ప్రగతి సాధించాలని కోరారు. ఉద్యోగం చేస్తున్న మహిళలు ఒత్తిడికి గురవుతున్నారని, వారికి పురుషులు సహకరించాలని కోరారు. విధుల్లో మరింత నిబద్ధతతో పనిచేసి ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్ఎంయూ అధ్యక్షుడు పెరుమాళ్, డిపో సెక్రటరీ వి.బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ ప్రేమ, ఎంఈవో–2– ఉష తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి

సైదాపురం: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌తో కలిసి లింగనపాళెంలోని మామిడి తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా మామిడి పూత పూసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూత, మొగ్గ దశలో మోనోక్రోటాఫాస్ 1.6 మిలీ, మ్యాంకోజెట్ 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తద్వారా తేనె మంచు పురుగులు, పక్షికన్ను, బూడిద, మసి తెగుళ్లను నివారించవచ్చన్నారు.



మామిడి చెట్లను పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి

వినతుల రోజూ కానరారే...?



ఏర్పేడు ఎమ్మార్సీలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



కార్యాలయంలో ఉన్న సీఆర్‌పీలు

- ఏర్పేడులో ఎంఈవోలు ఎప్పుడొస్తారో.. ఎప్పుడెళ్తారో..
- పర్యవేక్షణ కరువు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండల విద్యాశాఖాధికారులు సమయపాలన పాటించటం లేదు. కార్యాలయానికి ఎప్పుడొస్తారో..? ఎప్పుడెళతారో తెలియని పరిస్థితి. మండలంలోని స్కూళ్లను పరిశీలించి ప్రగతిపథంలో నడపాల్సిన ఎంఈవోలు ఫీల్డ్ విజిట్ల పేరుతో బయటకెళుతూ ఎమ్మార్సీకి రావటం లేదు. సోమవారం వినతుల దినమైనప్పటికీ ఇద్దరు ఎంఈవోలు కార్యాలయంలో లేకపోవటం గమనార్హం. పాఠశాలల తనిఖీ పేరుతో మండలంలోని పాఠశాలకు వెళ్లినట్లు తెలుస్తోంది. కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌తోపాటు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి, వివరాలను సేకరించాల్సిన సీఆర్‌పీలు తిష్టవేసి ఉన్నారు. దీనిపై తిరుపతి డీవైఈవో బాలాజీని వివరణ కోరగా కార్యాలయానికి ఎందుకు గైర్హాజరయ్యారో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

గిరిపుత్రులకు తప్పని నీటి కష్టాలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం బసయ్యపాళెం ఎస్టీ కాలనీలో నెల రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి బోరు మోటార్ మరమ్మతులకు గురికావడంతో నెల నుంచి నీరు పంపిణీ చేయడం లేదని, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు మోటారును బాగు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని జాతీయ రహదారి కూడళ్లలో అండర్‌పాస్ బ్రిడ్జిలు, సర్వీసు రోడ్లు నిర్మించాలన్న తిరుపతి ఎంపీ గురుమూర్తి కోరిక మేరకు ఎన్‌హెచ్ అధికారులు సోమవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. విన్నమాల, నరసారెడ్డి కండ్రిగ, అయ్యప్పరెడ్డి పాళెం, పండ్లూరు తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారి కూడలి ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు మృతిచెందారు. ఈ క్రమంలో అండర్ పాస్ బ్రిడ్జిల ఆవశ్యకతను స్థానికులతోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కామిరెడ్డి రాజారెడ్డి ఎంపీకి వివరించారు. ఆయన బ్రిడ్జీలు నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ఎన్‌హెచ్ కన్సల్టెన్సీ అధికారులు సోమవారం నాయుడుపేట సమీపంలోని పలు గ్రామాల సమీపంలో వెళుతున్న జాతీయ రహదారిని పరిశీలించారు. నరసారెడ్డి కండ్రిగ, అయ్యప్పరెడ్డి పాళెం, పండ్లూరు సమీపంలో అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించాలని స్థానికులు వారికి విన్నవించారు.

మాజీ అధ్యక్షులకు సన్మానం



మాజీ అధ్యక్షులకు సన్మానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎన్జీవో హోమ్‌లో సోమవారం మాజీ అధ్యక్షులు పైని, పురుషోత్తం గౌడ్, వెంకయ్య, భక్తవత్సలంకు ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు చెంచురత్నం యాదవ్, కార్యదర్శి సి నాగరాజు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో సంఘం వ్యవస్థాపకులు ఆమనగంటి శ్రీరాములు సేవలు అనిర్వచనీయమన్నారు. ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ భవిష్యత్తులో ఉద్యోగులు ఐక్యతతో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్జీవో అసోసియేషన్ ముందుటుందన్నారు.